

13న పాలిసెట్ ప్రవేశపరీక్ష

కామారెడ్డి టౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో ఈనెల 13న పాలిసెట్ ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరుగుతుందన్నారు. అభ్యర్థులను ఉదయం 10 గంటల నుంచి ప్రవేశ కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. 11 గంటల తర్వాత వచ్చిన వారికి ఒక నిమిషం ఆలస్యమైన అనుమతి లేదని తెలిపారు. 2900 మంది అభ్యర్థులు ప్రవేశపరీక్ష రాస్తున్నారని తెలిపారు. అభ్యర్థులు తమ వెంట ఒక ఎస్‌బీ పెన్సిల్, బ్లాక్ ఆర్ బ్లూ పాయింట్ పెన్, హాల్ టికెట్ తీసుకుని రావాలని సూచించారు.



కామారెడ్డిలో యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకుంటున్న దృశ్యం

రాజీవ్ యువ వికాసం కోసం

పైరవీలు షురూ!

- పథకం లబ్ధి చేకూరేలా చేస్తామంటూ రంగంలోకి మధ్యవర్తులు
- అధికార పార్టీ నేతలను ఒప్పిస్తామంటూ పైరవీలు
- మధ్యవర్తుల మాటలను నమ్ముతూ ఆశ్రయిస్తున్న దరఖాస్తుదారులు
- లబ్ధిదారుల ఎంపిక కోసం మండల స్థాయి కమిటీల ఏర్పాటు
- అర్హులను గుర్తించేందుకు కమిటీలకు ప్రాధాన్యత
- ఇప్పటికే బ్యాంకర్లకు లక్ష్యాలను నిర్దేశించిన జిల్లా అధికారులు
- జిల్లాలో 13,450 యూనిట్ల లక్ష్యం • వచ్చిన దరఖాస్తులు 44,631

కామారెడ్డి, మే 10(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన యువత నుంచి ఇది వరకే దరఖాస్తులను స్వీకరించింది. ఈ నెల చివరి వరకు లబ్ధిదారులను ఎంపిక చేసి జూన్ మొదటి వారంలో యూనిట్లను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదేవిధంగా జిల్లాలోనూ రాజీవ్ యువ వికాస్ లబ్ధిదారుల ఎంపిక కోసం అధికార యంత్రాంగం వేగం పెంచింది. ఈ నేపథ్యంలో రాజీవ్ యువ వికాస్ యునిట్లను పొందేందుకు దరఖాస్తుదారులు ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే అధికార పార్టీ నేతల ఆశీస్సులు ఎవరికి ఉంటే పథకం లబ్ధి చేకూరుతుందని ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో కొందరు మధ్యవర్తులు రంగంలోకి దిగి దరఖాస్తుదారులకు మాయమాటలు చెబుతూ కమీషన్‌తో పథకం ఆర్థిక సాయం వచ్చేలా చూస్తామని నమ్మ బలికిస్తున్నారు. పలానా ఎమ్మెల్యే, అధికార పార్టీలోని ముఖ్యనేతలు తమకు సానుకూలంగా ఉన్నారని తాము చెప్పిన వారికే పథకాన్ని మంజూరు చేయిస్తామంటూ దరఖాస్తుదారులను నమ్మిస్తున్నారు. ఇదే క్రమంలో సదరు మధ్యవర్తులు ఎమ్మెల్యేలను, ముఖ్యనేతలను ఆశ్రయిస్తూ యువ వికాస్ దరఖాస్తు చేసుకున్న వారి కోసం పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో యూనిట్ల లక్ష్యం 13,450

జిల్లాలోని జనాభా ప్రతిపాదికన కులాల వారీగా రాజీవ్ యువ వికాస్ పథకానికి యూనిట్లను ప్రభుత్వం కేటాయించింది. జిల్లా వ్యాప్తంగా 13,450 యూనిట్లు లక్ష్యం. ఇందులో ఎస్సీ కార్పొరేషన్ యూనిట్ల లక్ష్యం 4,104, ఎస్టీ కార్పొరేషన్ యూనిట్ల లక్ష్యం 2,366, బీసీ యూనిట్లు 4,698, ఈబీసీ, ఈడబ్ల్యుఎస్ యూనిట్లు 1,271, ముస్లిం మైనార్టీ యూనిట్లు 977, క్రిస్టియన్ మైనార్టీ యూనిట్లు 44గా ప్రభుత్వం కేటాయించింది. పథకంలో రూ.50 వేలు, రూ.1లక్ష, రూ.2లక్షల నుంచి రూ.4 లక్షలు రుణాలు అందిస్తుండగా రూ.50 వేలకు వంద శాతం సబ్సిడీ రాయితీ, రూ.50 వేల నుంచి రూ.1లక్ష వరకు 90 శాతం సబ్సిడి, రూ.1లక్ష నుంచి 2 లక్షల వరకు 80 శాతం సబ్సిడీ, రూ.2లక్షల నుంచి 4 లక్షల వరకు 70 శాతం సబ్సిడీ ప్రభుత్వం అందించనుంది.

వచ్చిన దరఖాస్తులు 44,631

జిల్లాలోని 535 గ్రామ పంచాయతీలు, మూడు మున్సిపాలిటీల పరిధిలో రాజీవ్ యువ వి కా ‍ సం పథకానికి 44,631 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కార్పొరేషన్‌ల వారీగా చూస్తే ఎస్సీ కార్పొరేషన్‌కు 8,335 దరఖాస్తులు రాగా, ఎస్టీ కార్పొరేషన్‌కు 4,580 దరఖాస్తులు రాగా, బీసీ కార్పొరేషన్‌కు 23,946, ఈబీసీ, ఈడబ్ల్యుఎస్‌కు 1,046, ముస్లిం మైనార్టీ 6,663, క్రిస్టియన్ మైనార్టీలకు 116 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల గడువు ఈ నెల 14తో ముగియడంతో చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోయారు. దరఖాస్తు మరోసారి పెంచాలని యువత నుంచి డిమాండ్ వినిపిస్తోంది.

మండలస్థాయి కమిటీల ఏర్పాటు

రాజీవ్ యువ వికాస్ లబ్ధిదారుల ఎంపికకు మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశారు. ఇందులో అధికారులతో పాటు బ్యాంకర్లు సభ్యులుగా ఉంటారు. ఈనెల 20వ తేదీలోపు మండల స్థాయిలో అర్హులను గుర్తించే ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించారు. అనంతరం కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీ పరిశీలన తదానంతరం ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో లబ్ధిదారులను ప్రకటించనున్నారు. జూన్ 2న ఎంపిక చేసిన లబ్ధిదారులకు రాయితీ రుణాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నారు. ఇది వరకే బ్యాంకర్లకు సైతం లక్ష్యాలను నిర్దేశించారు.

సిబిల్ స్కోర్ మెరుగ్గా ఉంటేనే ఆమోదం

రాజీవ్ వికాస్ పథకానికి వచ్చిన దరఖాస్తులను ఇప్పటికే ఆయా బ్యాంకర్ల పరిశీలనకు పంపారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాటిని బ్యాంకర్లు పరిశీలిస్తున్నారు. ఈనెల 14వ తేదీలోపు బ్యాంకర్లు పరిశీలనను పూర్తిచేసేలా కార్యాచరణను పూర్తి చేశారు. దరఖాస్తుదారులకు కేటాయించిన బ్యాంక్‌లలో రుణ బకాయిలు ఉన్నాయా లేదా అన్ని పరిశీలించనున్నారు. ప్రధానంగా సిబిల్ స్కోర్‌ను తనిఖీ చేసిన తర్వాతే మెరుగ్గా ఉంటేనే ఆమోదం తెలుపనున్నారు. ఆ దరఖాస్తుదారులకే రుణం మంజూరు చేసే అవకాశాలు ఉన్నాయి. మండల పరిధిలో బ్యాంక్‌ల వారీగా రుణాలు మంజూరు చేయాల్సిన లక్ష్యాలను జిల్లా యంత్రాంగం నిర్దేశించింది. దీనికి అనుగుణంగా బ్యాంక్‌లు రుణాలు మంజూరు చేసేలా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంకర్లతో చర్చలు జరిపారు.



నిండుగా గ్రంథాలయాలు!

- పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు
- భవనం లేక పాఠకుల ఇబ్బందులు
- మినీ స్టేడియంలో కొనసాగుతున్న బాన్సువాడ గ్రంథాలయం



7

మితిమీరితే మోతే!

- వేసవిలో పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- 200 యూనిట్లు దాటితే జీరో బిల్లుకు దూరం



7

ఖరీఫ్ సాగు చేసేదెలా?

- రబీ సీజన్‌లో అందరికీ అందని రైతు భరోసా!
- నెల రోజుల్లో మొదలుకానున్న వానాకాలం సాగు



7



తుజాల్‌పూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోలు చేయాలని తుజాల్‌పూర్‌లో రైతుల రాస్తారోకో

- రైస్ మిల్లర్లు పట్టించుకోవడం లేదని ఆవేదన

బీబీపేట, మే 10 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ.. బీబీపేట మండలం తుజాల్‌పూర్ గ్రామ రైతులు శనివారం గ్రామ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు తుజాల్‌పూర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రం వద్ద తాము ఉంచిన ధాన్యం బస్తాలు తడిసి పోయాయని తెలిపారు. వీటిని కొనుగోలు చేయాలని నిర్వాహకులను కోరితే.. పట్టించుకోవడం లేదన్నారు. అలాగే కొందరి రైతులకు సంబంధించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి.. రైస్ మిల్లులకు తరలించినట్టు తెలిపారు. అయితే లారీల నుంచి మిల్లర్లు ఆ ధాన్యాన్ని కూడా దించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రోజుల తరబడి ధాన్యం సంచుల వద్దే కాపలా కాయాల్సి వస్తోందన్నారు. ఇలాంటి రైస్‌మిల్లర్ల పై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అధికారులు రైతులకు సర్ది చెప్పారు. సమస్యను వెంటనే పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.



నల్లమడుగులో భూ భారతి సిబ్బందిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

భూ భారతి సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ విక్టర్

లింగంపేట, మే 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో భూ భారతి పైలెట్ మండలం లింగంపేట మండలంలో రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బంది సక్రమంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. ఆయన శనివారం లింగంపేట మండలంలోని పోతాయిపల్లి, నల్లమడుగు గ్రామాల్లో సిబ్బంది పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మండలంలోని కోమట్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలోని సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు తాగునీరు, ఉండేందుకు టెంట్‌తో పాటు టార్పాలిన్ కవర్స్‌ను ఏర్పాటు చేయాలని ఆయన నిర్వాహకులను ఆదేశించారు. తూకం వేగవంతం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రైతులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సీఎం, షబ్బీర్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం



సీఎం, షబ్బీర్‌అలీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

రాజంపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ చిత్రపటాలకు శనివారం కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు యాదవరెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రాణ హిత - చేవెళ్ల పనులు వేగవంతంగా జరగగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే 10 సంవత్సరాలు పనులు ముందుకు సాగలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి పనులు మొదలయ్యాయని తెలిపారు. రూ.23 కోట్లు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ కృషి ద్వారా మంజూరు అయ్యాయని తెలిపారు.

నేడు ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్ట్ పైలాన్‌కు క్షీరాభిషేకం

కామారెడ్డి టౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో గల ప్రాణహిత - చేవెళ్ల సుజల స్రవంతి ప్యాకేజీ 20,21,22 ప్రాజెక్ట్ పైలాన్‌కు ఆదివారం క్షీరాభిషేకం చేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు ఐరేనీ సందీప్‌కుమార్, లక్కపత్ని గంగాధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ కృషితో రూ.23.15 కోట్ల నిధులను విడుదల చేయించి పనులు ప్రారంభం చేస్తున్నందున కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున కార్యకమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నామన్నారు.



చీనూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న డీసీవో

ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన డీసీవో

నాగిరెడ్డిపేట్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్తుమ్మెద సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం జిల్లా సహకార అధికారి రాంమోహన్ పరిశీలించారు. సహకార సంఘ పరిధిలోని చీనూర్, వాడి, గోలి లింగాల, మాల్తుమ్మెద, నాగిరెడ్డిపేట్, లింగంపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీవో రాంమోహన్ మాట్లాడుతూ అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడవకుండా బస్తాలపై టార్పాలిన్ కవర్లు కప్పి ఉంచాలని సూచించారు. తూకం వేసిన బస్తాలను వెంట వెంటనే లారీల్లో మిల్లులకు పంపాలని, దీంతో పాటుగానే తూకం పూర్తయిన ధాన్యం డబ్బులు వెంటనే వచ్చేలా ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు పూర్తయ్యే వరకు సహకార సంఘ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి నర్సింలు, సీఈవో సందీప్, సహకార సంఘ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మా ఊరి రోడ్డు బాగయ్యేదెన్నడో!?

- గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.2.80 కోట్లు మంజూరైనట్లు ప్రకటన
- ఈ సారి కూడా రోడ్డు బాగు కాదేమోనన్న ఆవేదనలో అమర్లబండ గ్రామస్థులు

సదాశివనగర్, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా అమర్లబండ గ్రామస్థుల కష్టాలు మాత్రం ఏ మాత్రం మారడం లేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎందరో రాజకీయ నాయకులు ఉన్నతాధికారులు ఏళ్ల నుంచి వర్షాకాలం వాగు ఉధృతి గ్రామ ప్రజల పరిస్థితి చూసి ఆరోజు వాగ్దానాలు చేయడమే తప్ప ఇంత వరకు అమర్లబండ వాగు గురించి పట్టించుకున్న నాథుడే లేకుండా పోయాడని గ్రామ ప్రజలు అంటున్నారు. ఓట్ల సమయంలో ప్రచారానికి వచ్చినప్పుడే అమర్లబండ కష్టాలు కన్పిస్తాయి తప్ప తర్వాత ఎవరూ తిరిగి చూడటం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయం సమీపించడంతో ఎల్లారెడ్డిలో జరిగే ప్రత్యేక సమావేశంలో అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అమర్లబండ వంతెన నిర్మాణానికి రూ.2.80కోట్లు మంజూరైనట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మరికొన్ని రోజుల్లో ఎన్నికలకు వెళ్తున్నందున ఎన్నికల కోడ్ వస్తుందన్న ఉద్దేశ్యంతో బ్రిడ్జి నిర్మాణం కోసం శిలాఫలకం వేశారు. శిలాఫలకం వేయడం మంత్రి ప్రకటన చేయడం చూసిన గ్రామస్థులు ఇంకా మా కష్టాలు తీరాయని సంతోషం వ్యక్తం చేశారు.

ఎన్నికలు రావడమే ప్రజలకు శాపమా?

నెల రోజుల్లో ఎన్నికలు రావడం బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతోనే మా బ్రిడ్జి నిర్మాణం ఆగిపోయిందా అని గ్రామ ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంజూరైన నిధులు ఏమయ్యాయి, ఎక్కడ వెళ్లాయి అనే సందేహం గ్రామస్థుల మదిలో కలగడం విశేషం. ఒక ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను కొత్తగా వచ్చిన ప్రభుత్వాలు తప్పకుండా అవసరం ఉంటే సత్వరమే పూర్తి చేయాలన్న ఆలోచన కూడా ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాల్లో కలగకపోవడం విచారకరమని గ్రామస్థులు వాపోతున్నారు.

వర్షాకాలం ప్రజల కష్టాలు

వర్షకాలం వాగు ఉధృతితో గ్రామ ప్రజలు గ్రామంలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అత్యవసర సమయంలో ప్రత్యామ్నాయంగా గ్రామ ప్రజలు ట్రాక్టర్లపైన వాగులు దాటించడం తప్ప వేరే మార్గం లేకపోవడంతో వర్షాకాలం వచ్చిందంటే గ్రామ ప్రజలు బిక్కుబిక్కుమంటు ఇళ్లలోనే ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. గ్రామం చుట్టూ వాగులు ఉండటంతో వర్షం తగ్గే వరకు ఎంత ఆపద వచ్చినా ఇంటిలోనే ఉండాల్సి రావడం తప్పా ఏమి చేయలేని గ్రామ ప్రజలు ఎంతో మంది నాయకులను వేడుకున్నా ఇప్పటి వరకు ఫలితం లేకపోవడం ఆశ్చర్యకరమని గ్రామ ప్రజలు అంటున్నారు.



అమర్లబండ వాగుపై తాత్కాలికంగా మొరం నింపిన దృశ్యం

ఎమ్మెల్యే మదన్‌మోహన్‌పైనే ఆశలు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇకనైనా మా ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మా పరిస్థితి కళ్లారా చూసి మా బాధలు తీరుస్తాడని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మంజూరైనా రూ.2.80 కోట్లు సత్వరమే ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి మా గ్రామానికి బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రజలను ఆదుకుంటాడనే నమ్మకంతో ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. దీంతో పాటుగా కోట్ల రూపాయలు ఖర్చు చేసి సదాశివనగర్, తాడ్వాయి మండలాలను కలపడానికి నిర్మించిన రోడ్డు అమర్లబండ చెరువు అలుగు వద్ద బ్రిడ్జి లేకపోవడంతో వర్షాకాలం రెండు మండలాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిపోతాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ వహించి రెండు బ్రిడ్జిలను నిర్మించడంతో పాటుగా చెడిపోయిన బీటీ రోడ్డును రెన్యూవల్ బీటీగా మార్చి ప్రజలను ఆదుకుంటాడని గ్రామ ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న

ఆర్మూర్‌టౌన్,మే10(ఆంధ్రజ్యోతి):దేశవ్యాప్తంగా ఈనెల 20 జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని టీయూసీఐ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న, ప్రధాన కార్యదర్శి ఆర్. రమేష్‌లు అన్నారు. కార్మికులకు ఉద్యోగ,ఆరోగ్య భద్రత కరువైందని దీనికి మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పోరేట్ కంపెనీల అనుకూల, కార్మిక వ్యతిరేకత విధానాలే కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయుసీఏ జిల్లా ఉపాధ్యక్షురాలు జి. సత్తెవ్వ, నాయకులు కే. రాజేశ్వర్, అరవింద్, కిషోర్ పాల్గొన్నారు.

భీమ్‌గల్ రూరల్:కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20నదేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను నిర్వహించడం జరుగుతుందని ఈసమ్మెలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో జిల్లా నాయకుడు కే. రాజేశ్వర్, బీడీ కార్మికులు సత్యం, అమీర్, బాబా, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: ఈ నెల 20వ తేదిన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. శనివారం బోధన్ పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 11సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వ పాలనలో కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోయ్యాయన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాలు ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు.ఈ సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు మల్లేష్,శంకర్‌గౌడ్, వరదయ్య, సీహెచ్‌వీ హన్మంత్‌రావు, నాగేశ్వర్ రావు,ప్రవీణ్, గోపి తదితరులున్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

కోటగిరి,మే10(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండల కేంద్రానికి చెందిన తోకల గంగారాం(60)అనే వ్యక్తి మంజీర నదిలో చేపలు పట్టేందుకు వెళ్లి మృతి చెందినట్లు ఎస్‌ఐ సునీల్ తెలిపారు. గంగారాం శుక్రవారం ఉదయం మంజీర నదిలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. మంజీర నదిలో తెప్పపై వెళ్లి చేపలు పడుతుండగా జారి నీటిలో పడ్డాడు. చేపలు పట్టే వల కాళ్లకు చుట్టుకుని నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య లచ్చవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో దూకి వృద్ధుడి ఆత్మహత్య

రెంజల్,మే10(ఆంధ్రజ్యోతి): మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన గోపాల్ గంగారాం(60))అనే వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని రెంజల్ ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన గోపాల్ గంగారాం తన కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతుండేవాడని, అనారోగ్యం తాళలేక మనస్తాపం చెందిన గంగారాం శుక్రవారం గ్రామంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని చెరువు వైపు వెళ్లిన గ్రామస్థులకు తేలియాడిన మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించి మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

దేగాంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ

ఆలూర్,మే10(ఆంధ్రజ్యోతి):ఆలూర్ మండలం దేగాంలో జాతీయ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ శనివారం నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సమీక్ష, సోషల్ ఆడిట్ నిర్వహించారు.ఈకార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి రాంబాబు, పంచాయ తీరాజ్ ఏఈఈనితీష్, కార్యదర్శి శ్రీనివాస్,ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

ఆర్మూర్‌టౌన్ , మే 10(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని ఏడవ వార్డు మామిడిపల్లిలో తిరుమల కాలనీలో శనివారం అనుమాన స్పదంగా వివాహిత మహిళ ఆకుల లావణ్య (28) మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జక్రాన్‌పల్లి మండల కేంద్రానికి చెందిన లావణ్యకు మామిడిపల్లికి చెందిన ప్రవీణ్‌కు తొమ్మిది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక్క కుమారుడు ఆర్థిక ఇబ్బందుల వల్ల తరచు భార్యభర్తల మధ్య గొడవలు జరిగేవని అందులో భాగంగానే లావణ్య మృతిచెందినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా లావణ్యను భర్త ఆకుల ప్రవీణ్ బెడ్‌షీట్‌తో ఊపిరి ఆడకుండా చేసి చంపాడని అనుమానించిన పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

వర్నిలో సమ్మె కరపత్రాల ఆవిష్కరణ

వర్ని,మే10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులు వర్ని మండల కేంద్రంలో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నాలుగు కార్మిక కోడ్‌లు కార్మికులకు ఉరి తాళ్లుగా మారాయని కార్మికులు మండిపడ్డారు. సార్వత్రిక సమ్మెతో కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ది చెబుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, ఆశాయూనియన్ నాయకులు నాగమణి, రాధ, బాలమణి, కార్మికులు గంగారాం, స్వాతి,ఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎన్‌ఆర్‌ఐ ఆర్థిక సహాయం

కోటగిరి,మే10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లభాపూర్‌లో ఓ బాధిత కుటుంబానికి శనివారం బీజేపీ నాయకులు, ఎన్‌ఆర్‌ఐ కోనేరు శశాంక్ తన ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. వల్లభాపూర్ గ్రామానికి చెందిన బస్వంత్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పేద కుటుంబం కావడంతో కుటుంబాన్ని పోషించుకునే స్థోమత లేకపోవడంతో విషయం తెలుసుకున్న ఎన్‌ఆర్‌ఐ తనవంతు సాయంగా ఆర్థిక సహాయంతో పాటు పిల్లల చదువుకు సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు నవీన్, గంగాధర్, అశోక్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవీపేట,మే10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో అశోక్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించే ఈ వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు ఉచితంగా సంగీతం, నృత్యం, చిత్ర లేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్ వాటిపై శిక్షణ అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లమట్టి తరలిస్తున్న లారీ బోల్తా

ఆర్మూర్‌రూరల్,మే10(ఆంధ్రజ్యోతి):నందిపేటలో విజయనగరం సమీపంలో నల్లమట్టిని తరలిస్తున్న లారీ ఇరుకైనా వంతెన వద్ద నడ్డిరోడ్డుపై బోల్తా పడింది. పంచకూడా బ్రిడ్జి వద్దనుంచి ఆర్మూర్ ప్రాంతం లోని వివిధ గ్రామాలకు నల్లమట్టిని తరలిస్తున్న వాహనం అదుపు తప్పి బోల్తా పడింది.అదేసమయంలో సమీపంలో వాహనాలు లేకపోవ డంతో త్రుటిలో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. స మాచారం అందు కున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రోడ్డుపై పడిన నల్లమట్టిని లారీని తొలగించడానికి కృషి చేశారు. ఈ సందర్భంగా చాలా సేపు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు అంత రాయం కలిగింది.

భారత సైన్యానికి మద్దతుగా ఆలయంలో పూజలు


బాల్కొండ హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

బాల్కొండ, మే 10(ఆంధ్రజ్యోతి):ఆపరేషన్ సిందూర్ అనంతరం పాకిస్తాన్, భారత్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంలో భారత్ విజయం సాధించాలని, భారత్ జవాన్లు క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తు సైన్యానికి మద్దతుగా మండల బీజేపీ ఆధ్వర్యంలో శనివారం బాల్కొండలోని ఆలయం లో పూజలు చేశారు. స్థానిక వీరాంజనేయ దేవాలయంలో హనుమాన్ చాలీసా పారాయనం చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అంబటి నవీన్, కిసాన్‌మోర్చ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోట చిన్నయ్య, మండల అధ్యక్షుడు ఆరెపల్లి నర్సయ్య, మండల బీజేవైఎం అధ్యక్షుడు జక్కం శ్రీకాంత్, తోట నవీన్, తేపారం అశోక్, కాలరవి, సాయి కిరణ్, తోట నాగేష్, వినోద్, ఓమాజి కిశాన్, నరేందర్, మహేష్, గణేష్‌జోషి పాల్గొన్నారు.

ముప్కాల్: భారత్ పాకిస్తాన్ మధ్య జరుగుతు న్నా యుద్ధంలో భారత్ సైన్యానికి మద్దతుగా శనివారం ముప్కాల్ మండల కేంద్రంలో యువకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ముప్కాల్ హనుమాన్ మందిరంలో ఆపరేషన్ సిందూర్ లో భారతీయుల జవాన్‌లకు మనోధైర్యాన్ని శక్తిని ప్రసాదించాలని, ధైర్య సాహసాలతో ఆప రేషన్ సందూర్ విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేముసైతం భారత్ జవాన్‌ల వెంట అంటూ తమ వంతు సంగీ భావం గా ఘంట నాధాన్ని మ్రోగించారు. ఈ కార్యక్మంలో గడ్డం సంతోష్, గోపి నాద్, మ్యాక నర్సయ్య, చంద్రమోహన్, ప్రకాష్, రవి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: భారత ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్ సిందూర్ మరింత విజయవంతం కావాలని బీజేపీ నాయకులు భజరంగ్ హన్మాండ్లు ఆకాంక్షించారు. పోతంగల్ మండల కేంద్రంలోని బాలాజీ మందిరంలో శనివారం ఆపరేషన్ సిందూర్ విజయవంతం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దులో జవాన్లు వీరోచితంగా పోరాడుతున్నారని కొనియాడారు. వారికి సంఘీభావంగా ప్రజలు ర్యాలీలు, పూజలు నిర్వహించాలని ఆకాంక్షించారు. పాకిస్తాన్‌లాంటి దేశాలకు భారత దేశం వైపు కన్నెత్తి చూడకుండా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సైనికులు చేస్తున్న పోరాటానికి ప్రతి ఒక్కరు అండగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంగారాం, అశోక్, శంకర్, హన్మాండ్లు, కిష్టయ్య, సాయిరాం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలి


బోధన్ శిక్షణ శిబిరంలో భాగంగా మాట్లాడుతున్న ఎంఈవో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్

బోధన్‌రూరల్,మే10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలనిచ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని మండల విద్యాశాఖ అధికారి నాగయ్య అన్నారు. శనివారం ప్రత్యేక తరగతుల శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. బోధన్ మండలంలోని అర్బన్, రూరల్ పాఠశాలల్లో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని పట్టణంలోని జేసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రారంభించామని ఆయన అన్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థిని, విద్యార్థులకు ఈ నెల 25వ తేది వరకు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యార్థిని, విద్యార్థులకు సంగీతం, నృత్యం, కరాటే, అర్ట్ క్రాఫ్ట్ డ్రాయింగ్ ఉపాధ్యాయురాలు సంగీత గారిచే సంగీతం, చంద్రప్రకాష్ గారిచే రైటింగ్, అవంతితో విద్యార్థిని, విద్యార్థులకు డ్రాయింగ్ నేర్పించబడుతుందన్నారు. కరాటే మాస్టర్ అశోక్ కుమార్ రోడే ద్వారా కరాటే నేర్పించబడుతుందన్నారు. శ్రీకాంత్ మాస్టర్ చేత డ్యాన్స్ చేర్పించబడుతుందన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి నాగయ్య మాట్లాడుతూ శనివారం 46మంది విద్యార్థిని, విద్యార్థులు వేసవి శిక్షణలో పాల్గొనడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు,విద్యార్థులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం వేసవిశిక్షణ శిబిరాన్ని ఎంఈవో తమ్మిరెడ్డి ప్రా రంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభు త్వ ఆదేశాలతో ప్రారంభించిన వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవా లని అన్నారు.ఈశిక్షణ శిబిరం ఈనెల 30 వరకు కొనసాగు తుందని అన్నా రు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ శ్రీనివాస్, పురుషోత్తం స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పిస్తారని, శివాణి కరాటే నేర్పిస్తారని, డ్రాయింగ్‌ను రాములు నేర్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆలూర్: ఆలూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సమ్మర్‌క్యాంపుని ఎంఈవో నరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజుల పాటు నిర్వహించనున్నా సమ్మర్ క్యాంపును విద్యార్థులు పద్వినియోగం చేసుకోవా లని సూచించారు. యోగా, స్పోకెన్ ఇంగ్లీష్, డ్యాన్స్, చిత్రలేఖనం, ప్రాథమిక గణితం అంశాలలో తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కల్లెడి హెచ్‌ఎం నాగరాజు, ఉపాధ్యాయులు రణవీర్, సువర్ణ, ముత్యం, అశ్వక్‌షామాద్, శివకుమార్, రాంప్రభు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి:వేసవి క్రీడల ప్రత్యేకశిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. శని వారం జక్రాన్‌పల్లిలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి క్రీడల ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈకార్యక్రమంలో హెచ్‌ఎంలు లింగన్న, శ్రీనివాస్‌రెడ్డి,మండల పీఆర్టీయూ అధ్యక్షుడు గోపి,అశోక్,ముత్యంరెడ్డి, రాజు, సత్యనారాయణ పాల్గొ న్నారు.

రెంజల్: ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం 8నుండి 14సంవత్సరాల వయసు గల విద్యార్థుల కోసం మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు అన్నారు. శనివారం రెంజల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు అరుణ్, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణమూర్తి, బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్కొండ:బాల్కొండజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కు వేసవి శిభిరాన్ని శనివారం ఎంఈవో రాజేశ్వర్ ప్రారంభించారు. 15 రోజుల పాటు నిర్వహించనున్నా ఉచిత శిక్షణ శిభిరంలో విద్యా ర్థులకు యోగా, కంప్యూటర్ డ్రాయింగ్,స్పోకెన్‌ఇంగ్లీష్, వ్యక్తిత్వ వికా సం, తదితర అంశాలలో ఉదయం 8నుంచి 11గంటల వరకు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు.

కమ్మర్‌పల్లి: ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమ్మర్‌పల్లి మండల విద్యాధికారి, కోర్స్ కోఆర్డినేటర్ నేర అంద్రయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయన్న, సీనియర్ ఉపాధ్యాయులు లక్ష్మీనర్సయ్య, వాలిటెర్లు నరేష్, కే మనిషా, వి సరస్వతి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్గుల్‌లో ఘనంగా ఉర్సు ఉత్సవాలు


ఉర్సు ఉత్సవాలలో పాల్గొన్న మైనార్టీ పెద్దలు

జక్రాన్‌పల్లి,మే10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో ఉర్సు ఉత్సవాలను మైనార్టీ పెద్దలు, గ్రామస్థులు భక్తిశ్రద్దలతో ఘనంగా జరుపుకుంటున్నారు.గురువు ముజీబ్‌అన్సారీ ఆధ్వర్యంలో ఉర్సు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి గ్రంథాలు, ఉత్సవాలు జరుగగా శనివారం ఉర్సు ఉత్సవాలు జరిగాయి. మైనార్టీ గుట్టపై రోజు కవలి కార్యక్రమం నిర్వహిస్తున్నారు.ఈఉత్సవాల్లో నిజామాబాద్ జిల్లాతో పాటు వివిధ జిల్లాల నుంచి పాల్గొనడానికి మైనార్టీ పెద్దలు వచ్చారు. మైనార్టీ గుట్టపై మూడు రోజుల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆదివారం మైనార్టీ గుట్టపై కవలి కార్యక్రమం జరుగుతుందని మైనార్టీ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురువు ముజీబ్ అన్సారీ, మైనార్టీ పెద్దలు బడేమియ్య, పాష, మైనార్టీ పెద్దలు పాల్గొన్నారు.

రాజీవ్‌యువ వికాస్ పథకానికి సిబిల్‌స్కోర్ ఎత్తివేయాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరిమూర్తి

మెండోర, మే 10(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువవికాసం పథకానికి సిబిల్ స్కోర్ ఉంటేనే అర్హులు అవుతారని ప్రకటించడం ఆ సిబిల్ స్కోర్ ఎత్తివేసి నిరుద్యోగులకు ఇవ్వాలనీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్‌యువ వికాసం పథకం ప్రవేశ పెట్టడం శుభ సూచికమని, గత ప్రభుత్వం ఊరికి 5 నుంచి 10 యూనిట్లకు రూ.50వేల చొప్పున కొన్ని కులాలకు మాత్రమే మంజూరు చేసి, చేతులు దులుపుకున్న సంగతిని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే యువ తకు ధైర్యం వచ్చిందని, ప్రభుత్వ ఉద్యోగాలు రాకున్నా, రాజీవ్‌యువ వికాసం పథకంతో ఏదైనా చిన్న వ్యాపారం చేసుకోవచ్చు అని ఆశ పడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు రూ.6000 కోట్లతో, 5 లక్షల మందికి రుణాలు ఇవ్వాలనే లక్ష్యంతో దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని ఇంతలోనే సిబిల్ స్కోర్ ప్రకారమే ఎంపిక చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకో వడం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను మోసం చేయడమే అని విమర్శించారు. బీసీ, ఎస్సీ ఎస్టీ , మైనారిటీలకు ఎక్కడ ఏమి ఆధారం లేకుండా జీవనోపాది గడు స్తాది. కావున ప్రభుత్వం పునరాలోచించి సిబిల్ స్కోర ఎత్తివేసి యువ తను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మోర్తాడ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మర్రిపల్లి భూపతికి డాక్టర్‌రేట్ పట్టా

మోర్తాడ్,మే10(ఆంధ్రజ్యోతి): మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నా మర్రిపల్లి భూపతి ఉస్మానియా యూనివర్సిటీ నుండి చరిత్ర విభాగంలో పీహెచ్‌డీ డాక్టర్ రేట్ డిగ్రీ పట్టా పొందారు. ప్రొఫెసర్ కే. రామకృష్ణ పర్యావేక్షణలో ఎవల్యూషన్ అండ్ ఇన్‌ఫాక్ట్ అఫ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఇన్ తెలంగాణ ఫ్రమ్ 1956 నుండి 2014 విత్ స్పెషల్ రెఫరెన్స్ టూ నిజామాబాద్ డిస్టిక్ అనే అంశం మీద పరిశోధన చేశారు. మచ్చర్ల గ్రామానికి చెందిన మర్రిపల్లి భూపతి కష్టపడి ప్రతిష్టాత్మక ఉస్మానియ యూనిర్సిటీ నుండి పీజీ, పీహెచ్‌డీ అందుకున్నారు. 22 సంవ త్సరాలుగా విధులు నిర్వహిస్తు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రశంసలు అందు కున్నారు. వక్తగా, రాతప్రతుల పరిశోధకుడిగా జిల్లాకు గర్వకారణం అయ్యా రు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు , పోలీస్ శిబిరాలు వెనుకబడిన వర్గాలకు ఉచితంగా మోటివేషన్ క్లాస్‌లు, సృజనాత్మక విద్యాతో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. పోటీ పరీక్షల్లో ఉచి తంగా యూట్యూబ్ క్లాస్‌లు నిర్వహిస్తున్నారు. విద్యాభివృద్ధి, సామాజిక చైతన్యం, మానసిక వికాసం కోసం నిరంతర విద్యార్థిగా శ్రమిస్తున్నారు. ప్రొఫెసర్ లావణ్య చరిత్ర విభాగం అధ్యక్షుడు ప్రొఫెసర్ ఇందిరా, డాక్టర్ అరుణ, రమేష్ తనకు సహకరించిన అందరికి ధన్యవాదాలు తెలిపారు.

నేడు లక్ష్మినరసింహ స్వామి కల్యాణ మహోత్సవం

నవీపేట,మే10(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లిలో ఆదివారం శ్రీ లక్ష్మినరసింహ స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నవీపేట,మే10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇద్దరు లబ్దిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. సుమారు 96వేల రూపాయల విలువైన ఈ చెక్కులను బాధితుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల మంజూరుకు కృషి చేసిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భగవాన్, సంజీవ రెడ్డి, గోపాల్, నీరడి సాయన్న తదితరులున్నారు.

రాణంపల్లిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు


గంగారమండలో పశువులకు టీకాలు ఇస్తున్న దృశ్యం

కోటగిరి,మే10(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని రాణంపలి గ్రామంలో శనివారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పంపిణీ చేశారు. పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేస్తున్నట్లు పశు వైద్యాధికారి సంతోష్ రెడ్డి తెలిపారు. గ్రామంలో 192పశువులకు టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది భూమేష్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్‌దేష్‌పాండే తెలిపారు. శనివారం మండలంలోని గాలిబ్‌నగర్, గద్యాల క్యాంపు, గంగారామండ గ్రామాలలో పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేశారు.ఈకార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, షైమద్‌పాషాతో రైతులు పాల్గొన్నారు.

'ఎన్‌ఆర్‌ఐ' సలహామండలి సభ్యుడిగా సత్యం

జక్రాన్‌పల్లి , మే 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్‌ఆర్‌ఐ పాలసీ సలహమండలి సభ్యులుగా కలిగోట గ్రామానికి చెందిన సత్యంగౌడ్‌ను నియమించారు. దుబాయిలో ఉంటున్న ఎన్‌ఆర్‌ఐలు శనివారం సత్యంగౌడ్‌ను కలిసి శాలువతో సత్కరించారు. ఎన్‌ఆర్ఐ పాలసీలో బాగంగా సలహామండలి సభ్యునిగా సత్యంగౌడ్‌ను నియమించడం పట్ల ఎన్‌ఆర్‌ఐలు, కలిగోట గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్‌ఆర్‌ఐలు కాట్‌పల్లి విజయ్‌రెడ్డి, మద్దుల శ్రీనివాస్, నర్సయ్య, కాశాగౌడ్, రమేష్, మోహన్, మచ్చెందర్, చిన్ను, కొట్టాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు నవీపేటలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవీపేట,మే10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ మాధవ విద్యానికేతన్ హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. పాఠశాలకు చెందిన 1999-2000 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం స్థానిక ఎంఆర్‌ఎల్ గార్డెన్‌లో నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

రైతులను ముంచిన ధాన్యం వ్యాపారి రిమాండ్

బోధన్‌రూరల్,మే10(ఆంధ్రజ్యోతి): రైతుల ధాన్యం సొమ్ము 4కోట్ల రూపాయల మేర ఎగవేసి పరారైన కర్నాటక రాష్ట్రంలోని మైసూర్ సిటికి చెందిన సురేష్ చౌదరి అనే వ్యాపారిని శనివారం కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. బోధన్ రూరల్ పరిధిలోని గ్రామాలలోని రైతులకు కోటి 20లక్షలకు పైగా ఇవ్వాల్సి ఉందని, ఇతర ప్రాంతాల్లోని రైతులందరికి కలిపి సుమారు 4కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందని ఎస్సై తెలిపారు. రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా పరారైన సురేష్ చౌదరి అనే వ్యక్తిని పకడ్బందిగా పట్టుకొచ్చామని శనివారం కోర్టులో రిమాండ్ చేశామన్నారు.

కనీస పింఛన్‌ల సాధన కోసం పోరాడాలి

● ట్రేడ్ యూనియన్స్ రాష్ట్ర నాయకులు బి.మల్లేష్



రాణంపల్లిలో టీయూసీఐ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కోటగిరి,మే10(ఆంధ్రజ్యోతి): కనీస పింఛన్‌ల సాధనకై కార్మికులు పోరాడాల్సిన అవసరం ఎంతైన ఉందని ట్రేడ్ యూనియన్స్ రాష్ట్ర నాయకులు బి.మల్లేష్ పేర్కొన్నారు. రుద్రూరు మండలం రాణంపల్లి గ్రామంలో శనివారం తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం(టీయూసీఐ)ఆధ్వర్యంలో 139వ మేడే జయంతి ఉత్సవాలు నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు స్వామి టీయూసీఐ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం రక్తతర్పణం చేసి 8గంటల పనిదినాన్ని సాధిస్తే నేటి పెట్టుబడిదారి వర్గాలు 13గంటలు కార్మికులు పని చేయాలంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ఆరోపించారు. మన దేశ పాలకులు చట్టాలను మార్చి వేసి అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. దేశ కార్మిక వర్గం అనేక త్యాగాలు చేసి సాధించుకున్న 29చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మికులను కట్టు బానిసలుగా మార్చివేసే విధంగా చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికులు జీవించడానికి సరిపడ వేతనాలు ఇవ్వాలని, ఈపీఎఫ్ కట్ అవుతున్న కార్మికులకు రిటైర్డ్‌మెంట్ అయిన తర్వాత వచ్చే పింఛన్ కనీసం నెలకు రూ.9వేల ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేష్, అశోక్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రాణంపల్లిలో ఈతవనం దగ్ధం


రాణంపల్లిలో దగ్ధమైన ఈత వనం

కోటగిరి,మే10(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని రాణంపల్లి శివారులో శనివారం ఈత వనం దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఓ కౌలు రైతు తన పొలంలో వరి కొయ్యలకు నిప్పు పెట్టాడు. నిప్పు పెట్టిన వ్యక్తి కాపలా ఉండాల్సింది పోయి అందుబాటులో లేకపోవడంతో మంటలు వ్యాప్తించి ఈత వనాన్ని అంటుకున్నాయి. ఈ అగ్ని ప్రమాదంలో 40ఈత చెట్లు పూర్తిగా కాలిపోయ్యాయని గౌడ కులస్థులు తెలిపారు. ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించాలని కోరారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

మాక్లూర్, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్రాద్ గ్రామ శివారులో ఆర్‌అండ్‌బి రోడ్డు పక్కన శనివారం గుర్తు తెలియని వృద్దురాలి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతురాలి వయస్సు(60) ఉంటుందని ఇట్టి మహిళ గురించి ఏదైనా సమాచారం ఉన్నచో ఎస్‌హెచ్‌వో మాక్లూర్ 871259846 కు సంప్రదించాలని ఎస్సై చెప్పారు. ఈ మేరకు శవ పంచనామ నిర్వహించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

అప్రకటిత సమాచారం నమ్మవద్దు : ఎస్సై

భీమ్‌గల్ , మే 10(ఆంధ్రజ్యోతి): సైనిక సహాయ నిధి కోసం విరాళాలు సేకరిస్తున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న అప్రకటిత సమాచారాన్ని నమ్మవద్దని ఎస్సై మహేష్ తెలియజేశారు. శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్మీ ఆధునీకరణ విరాళాలు అంటు సోషల్ మీడియా పోస్టులు, సైనిక సహాయకనిధి కోసం డొనేషన్ పేరిట వెబ్‌సైట్లు, లింకులను ఓపెన్ చేయకూడదని తెలిపారు. కేంద్ర రవాణశాఖ ఇండియన్ ఆర్మీ కోసం ఎలాంటి విరాళాలు సేకరించడం లేదన్నారు. ప్రజల దేశభక్తిని ఆసరా చేసుకుని ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారని కనుక ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇలాంటి అనుమానాస్పద లింకులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

ఉపాధి కూలీలను కలిసిన కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్, మే10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చల నడ్కుడ గ్రామంలోని ఉపాధి కూలీలను శనివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పెద్దచెరువులో కొనసాగుతున్న ఉపాధి పనులవద్దకు కూలీలను కలిసేందుకు స్థానిక కాంగ్రెస్ నాయకులు వెళ్లారు. ప్రతీరోజు కూలీ వేతనం ఎంత వస్తుందని, చేసిన పనులకు కూలీ వేతనం ఎన్నిరోజులకొక్కసారి వస్తుందని, క్షేత్రస్థాయిలో పనులు చేసేటప్పుడు మీరేమైన సమస్యలు ఎదుర్కొంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్ర మంలో గ్రామ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు గుడాల మోహన్, సొసైటీ డైరెక్టర్ నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

● బోధన్ ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు



బోధన్ రూరల్, మే10 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బోధన్ ఎక్సైజ్ సీఐ భాస్కర్ రావు అన్నారు. మత్తుపదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు.

ఆంధ్రజ్యోతి: బోధన్ డివిజన్ పరిధిలో యువత డ్రగ్స్, మత్తు పదార్థాల బారిన పడుతున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎక్సైజ్ సీఐ: డ్రగ్స్, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి. వీటి బారిన పడకుండా యువతను తల్లిదండ్రులు పట్టించుకోవాలి. గంజాయి అమ్మకందారులపై కేసులు నమోదు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మారుమూల గ్రామాలలో బెల్ట్‌షాపులు పెరుగుతున్నాయి. వాటిపై చర్యలు చేపట్టారా?

ఎక్సైజ్ సీఐ: పట్టణంతో పాటు గ్రామాలలో బెల్ట్‌షాపులు పెరిగిన మాట వాస్తమే. వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: కల్తీ కల్లు విక్రయాలపై వాటిపై చర్యలు తీసుకున్నారా?

ఎక్సైజ్ సీఐ: కల్తీకల్లుపై ఇటీవల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కల్తీకల్లు అమ్ముతున్న షాపులపై దాడులు నిర్వహించి శాంపిళ్లు సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నాం. కల్తీకల్లు అమ్మిన పలు గ్రామాల్లో లైసెన్స్‌లు రద్దు చేశాం.

ఆంధ్రజ్యోతి: గంజాయి, బెల్ట్‌షాప్‌లు లేని గ్రామాలను చూడగలమా?

ఎక్సైజ్ సీఐ: రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు గంజాయి, బెల్ట్‌షాపులపై గట్టి నిఘాను ఏర్పాటు చేశాం. గంజాయి బారినపడ్డ యువతకు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఏర్పాటు చేశాం. ప్రజలకు సమాచారం తెలిస్తే 87126 58975కు సమాచారం అందించాలి.


● దుక్కిదున్ని భూమిని సిద్ధం చేస్తున్న రైతు (ఫైల్)

ఖరీఫ్ సాగు చేసేదెలా?

● రబీ సీజన్‌లో అందరికీ అందని రైతు భరోసా! ● నెల రోజుల్లో మొదలుకానున్న వానాకాలం సాగు

ఆర్మూర్ రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): రైతులు ఖరీఫ్ పంటలు సాగు చేయడానికి సమయం ఆసన్నమవుతోంది. అందుకు రైతులు పంటల సాగుకు పెట్టుబడిని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం అందజేసే పంట పెట్టుబడి సాయం రైతు భరోసా రబీ సీజన్‌లోనే పూర్తిస్థాయిలో అందలేదని రైతులు చెప్తున్నారు. నెల రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పుడేలా అన్న దిగులు రైతుల్లో నెలకొంది. యాసంగిలో నాలుగు ఎకరాలలోపే పెట్టుబడి సాయం అందజేశారు. ఖరీఫ్‌లో ఎప్పుడు జమచేస్తారో అని అనుమానం రైతులను వెంటాడుతోంది. 2024 ఖరీఫ్‌లో రైతు భరోసా రాలేదు. దీంతో రైతులు నష్టపోయారు. రైతన్నలు ప్రతీసారి ఇలా నష్టపోతూనే ఉన్నారు. గతంలో బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు పూర్తిస్థాయిలో రుణమాఫీ జరుగకా చాలామంది రైతులకు అప్పు అలాగే ఉంది. ఖరీఫ్‌లో పెట్టుబడులకు బ్యాంకులు మళ్లీ రుణాలు ఇచ్చేందుకు అనుమతించవు. ఇది రైతులను ఇబ్బందులకు గురిచేసే అంశం. రైతు భరోసా (పెట్టుబడి సహాయం) సకాలంలో రైతులకు అందకుంటే వారికి ఇబ్బందులు తప్పవు.


పంట పొలాల్లోకి నల్లమట్టి తరలిస్తున్న దృశ్యం

తొలకరి నుంచే డబ్బులు అవసరం

జూన్‌లో తొలకరి వర్షాలు కురియగానే రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతారు. సాగునీరు ఉన్న రైతులు ముందుగానే మే చివరివారంలో పంటలు సాగునకు మొగ్గు చూపుతారు. ఇక్కడినుంచే రైతుల అసలైన కష్టాలు మొదలవుతాయి. ఖరీఫ్‌లో పంట సాగు చేయడానికి తమ వ్యవసాయ క్షేత్రాల్లోకి పశువుల పేడ, నల్లమట్టిని తరలించి భూములను సారవంతం చేసుకుంటారు. దీనికి ఎంతో డబ్బులు అవసరమవుతాయి. అంతేకాకుండా దుక్కి దున్నాడానికి ట్రాక్టర్‌ఖర్చులు విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు డబ్బులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఈ సమయంలో రైతులకు అవస్థలు తప్పడం లేదు. దుక్కిదున్నడానికి, ఎరువులు, విత్తనాలకు ఖర్చులతో ఇతరాత్ర ఎన్నో ఖర్చులు ఉంటాయి. రైతులకు ఇది పెట్టుబడి కాలం కష్టకాలం. రాష్ట్ర ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం రైతు భరోసాను సకాలంలో అందజేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు కోరుతున్నారు.

విత్తనాలపై సబ్సిడీ ఊసే లేదు..

గతంలో ప్రతీ సీజన్‌లో రైతులకు విత్తనాలను సబ్సిడీపై ప్రభుత్వం అందజేసేది. వరి, మొక్కజొన్న, సోయ, శనగలు, పెసర్లు, మినుములు తదితర పంటల సాగుకు సబ్సిడీపై విత్తనాలు అందజేసేవారు. ప్రస్తుతం సబ్సిడీపై విత్తనాలు సరఫరా మాటే వినిపించడం లేదు. రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం విత్తనాలను సరఫరా చేస్తే ఎంతోకొంత డబ్బులు ఆదా అయ్యేవి. ఖరీఫ్ సీజన్‌కు ప్రారంభానికి ముందే రైతు భరోసా డబ్బులు రైతుల అకౌంట్‌లలో జమ చేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన


పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు

నిండుగా గ్రంథాలయాలు!

● పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ● భవనం లేక పాఠకుల ఇబ్బందులు
● మినీ స్టేడియంలో కొనసాగుతున్న బాన్సువాడ గ్రంథాలయం

బాన్సువాడటౌన్, మే10 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు నిండుగా కన్పిస్తున్నాయి. అనుకున్నది సాధించాలన్నా.. కొత్తగా ఏదైనా నేర్చుకోవాలన్నా చక్కనైన ప్లాట్‌ఫాం గ్రంథాలయం. ఏకాగ్రత స్థాయిలను పెంచడంలో సహాయపడుతుంది. అందుకే యువతీ యువకులు తమ కలలను నిజం చేసుకునేందుకు, తనుకున్నది సాధించేందుకు గ్రంథాలయాలకు ఉదయాన్నే చేరుకుని పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ తమ లక్ష్యానికి అనుగుణంగా బిజీబిజీ గడుపుతున్నారు.

2800 మందికి సభ్యత్వం

బాన్సువాడ గ్రంథాలయంలో మొత్తం 2800 మంది సభ్యత్వం తీసుకున్నవారున్నారు. ప్రతీరోజు 150మంది వరకు ఇక్కడి వచ్చి పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం పోటీపరీక్షలకు బాన్సువాడ గ్రంథాలయం అభ్యర్థులతో కిక్కిరిసిపోతోంది. కానీ గ్రంథాలయానికి భవనం లేకపోవడంతో పాఠకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పట్టణంలోని ప్రొ. జయశంకర్ మినీ స్టేడియంలో పాఠకులకు , పోటీ పరీక్షల అభ్యర్థులకు రీడింగ్ సెక్షన్‌ను ఏర్పాటు చేశారు. పాఠకులకు ప్రత్యేకంగా 110 ఎస్ టైప్ కుర్చీలు, అదనంగా 80కుర్చీలను అందుబాటులో ఉంచారు.

అందుబాటులో ఉన్న పుస్తకాలు

బాన్సువాడ గ్రంథాలయంలో అన్ని భాషలూ కలిపి 25 వేల 871 పుస్తకాలున్నాయి.

తెలుగు	-	17,033
హిందీ	-	1236
ఉర్దూ	-	1448
మరాఠీ	-	02
ఇంగ్లీష్	-	3082

వీటితో పాటు ఇతరత్రా, పోటీ పరీక్షల పుస్తకాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. దాతలు కూడా 30వేల రూపాయలు విలువ చేసే పుస్తకాలను గ్రంథాలయానికి అందించారు.



శిథిలావస్థలో గ్రంథాలయం

బాన్సువాడ శాఖ గ్రంథాలయం 1993 సంవత్సరంలో ప్రారంభమైంది. గతంలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దాని స్థానంలో నూతన భవన నిర్మాణానికి నిధులు సైతం మంజూరయ్యాయి. కాగా నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యే వరకు పాఠకులకు, పోటీ పరీక్షల అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పట్టణంలోని మినీ స్టేడియంలో గ్రంథాలయాన్ని కొనసాగిస్తున్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

● సుధాకర్, గ్రంథపాలకుడు



విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు గ్రంథాలయాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం వసతులు అంతంత మాత్రంగానే ఉన్నా పాఠకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. పాఠకులు, విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ఘనంగా వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండలో శనివారం శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకీని కొండపై చుట్టు ప్రదక్షణ చేయించారు. ఆలయంలో ప్రత్యేక పూజలుచేసి మొక్కులు తీర్చు కున్నారు. ఆలయంవద్ద భక్తుల కోసం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెర్కిట్ : ఆర్మూర్‌లోని వేంకటేశ్వర కాలనీలో గల లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం వరకు బ్రహ్మోత్సవాలు ఆలయ 32వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్నామని పురోహితుడు చిలుక మర్రి ఆనందచారులు తెలిపారు. సోమవారం వర్ధనచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించనున్నామని, అనంతరం అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.


తొర్లికొండలో ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేస్తున్న భక్తులు


ఫొటో న్యూస్


మంజీరా నదిలో తేలిన ఇసుక దిబ్బలు

ఎడారిగా మారిన మంజీర

బోధన్ రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): నిండుగా పారే మంజీర నది ఎడారిగా మారింది. నిండుకుండలా ప్రవహించే గోదావరి నీటి చుక్క లేకుండా వెలవెలబోతోంది. బోధన్, మహారాష్ట్ర మధ్య ఉన్న మంజీర నదిపై వెళ్తున్న ప్రయాణికులు ఎడారిగా మారిన మంజీరను ఆశ్చర్యపోతున్నారు. వేసవికాలంలో భూగర్భ జలాలు ఇంకిపోవడంతో కనీసం నీటి ధార కూడా కనిపించడం లేదు. మంజీర సరిహద్దులో ఉన్న గ్రామాలకు పంట పొలాలకు నీళ్లు అందించే మంజీర నేడు వెలవెలబోయింది. గ్రామాలకు సాగునీటితో పాటు తాగునీటిని సైతం అందించిన దాఖలాలు ఉన్నాయి. నిండుగా ప్రవహించినప్పుడు మంజీరా సరిహద్దుల్లోని గ్రామాల్లోని ప్రజలు అలర్ట్‌గా ఉండాలని అధికారులు ఆదేశాలు కూడా జారీ చేసిన రోజులు ఉన్నాయి. ఇటు మందర్నా, హంగర్గ, కొప్పర్గ తదితర గ్రామాలలో పంట పొలాలు మంజీర వరద నీటికి పంట పొలాలు మునిగిన రోజులను ప్రస్తుతం ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. మే మొదటి వారంలోనే ఎండలు మండుతున్నాయని వర్షాలు పడే దాకా మంజీర వైపు వేచి చూడాల్సిందేనని రైతులు, ప్రజలు అంటున్నారు. ఎండలు మండుతుండడంతో నీరు లేని మంజీరాగా కన్పిస్తోంది.


ఎండిపోయిన మంజీరా నది



మేకల సంతలో తాగునీటి కొరత


నవీపేటలో జరుగుతున్న మేకల సంత

నవీపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): నవీపేటలో ప్రతీ శనివారం జరిగే మేకల సంతలో తాగునీటి సమస్య తీవ్రమవుతోంది. ఉంది. రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున మేకలు, గొర్రెల క్రయవిక్రయదారులు సంతకు వస్తుంటారు. వీరితో పాటు ప్రతీ వారం సంతకు 10 నుంచి 15వేల వరకు మేకలు, గొర్రెలు సైతం అమ్మకానికి వస్తుంటాయి. సంతకు వచ్చిన అమ్మకందారులు, కొనుగోలుదారులకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చల్లని తాగునీటి డబ్బాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా అటువంటి ప్రయత్నాలు ఏమి చేయకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వాహనాలలో మేకలు, గొర్రెలు సైతం సంతకు తరలిస్తుండగా సంతలో జీవాలకు పలు చోట్ల నీటి డబ్బాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా అటువంటి ఏర్పాట్లు లేకపోవడంతో జీవాలు సైతం గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్నాయి. మేకల సంత ద్వారా గ్రామ పంచాయతీకి లక్షల రూపాయల ఆదాయం సమకూరుతున్నప్పటికీ సంతలో కనీస సదుపాయలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని వ్యాపారులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మేకల సంతకు వచ్చే అమ్మకందారులు, కొనుగోలు దారులకు చల్లటి మంచి నీటి డబ్బాలను అందుబాటులో ఉంచడంతో పాటు మేకలు, గొర్రెలకు సంతలో పలు చోట్ల నీటి తొట్టిలను అందుబాటులో ఉంచాలని వ్యాపారులు కోరుతున్నారు.

మితిమీరితే మోతే!

● వేసవిలో పెరుగుతున్న విద్యుత్ వినియోగం ● 200 యూనిట్లు దాటితే జీరో బిల్లుకు దూరం

ఏర్గట్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్న నేపథ్యంలో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవతున్నారు. ఎండతాపం నుంచి ఉపశమనం పొందడానికి ఏసీలు, ఫ్యాన్లు, కూలర్లను ఎక్కువగా వాడుతుండటంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుడగా జీరో బిల్లు కోసం పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా వేసవి దృష్ట్యా 200 యూనిట్లు బిల్లు మరింత అదనపు భారం కానుందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఎండలు దంచికొడుతుండగా విద్యుత్ వినియోగం పెరగడం ఖాయం కాగా.. కొందరికే జీరో బిల్లు వచ్చే పరిస్థితులు కనబడుతున్నాయి. విద్యుత్‌ను పొదుపుగా వాడుకుంటే తప్ప 200 యూనిట్‌లు దాటిన వారంతా బిల్లు చెల్లించాల్సిందేనని అధికారులు తేల్చిచెప్తున్నారు.

బిల్లు భారాన్ని అధిగమించాలంటే..

అవరసరం మేరకే ఫ్యాన్లు, కూలర్లు వాడాలి, ఏ గదిలో ఉంటే ఆ గదిలో ఫ్యాన్లు, లైట్లు వినియోగించాలి. ఉక్కపోత అధికంగా ఉన్నప్పుడే కూలర్లు వాడాలి. నాణ్యత లేని కూలర్లు, ఫ్యాన్లతో అధిక విద్యుత్ వినియోగంచడానికి ఆస్కారం ఉంది. ఎల్ఈడీ బల్బులు, ట్యూబ్‌లైట్లు వాడితే తక్కువ వినియోగం అవుతుంది. ఉచిత విద్యుత్ అనే భావనతో నిర్లక్ష్యం చేస్తే బిల్లు మోత తప్పదని విద్యుత్ శాఖ అధికారులు తెలుపుతున్నారు.


ఏర్గట్లలో విద్యుత్ బిల్లు కొడుతున్న సిబ్బంది

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

● ప్రభాకర్, విద్యుత్ శాఖ ఏఈ ఏర్గట్ల

వేసవిలో ప్రతీ వినియోగదారుడు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల వరకే ఉచిత విద్యుత్ అందిస్తుండగా అవసరాల మేరకే విద్యుత్‌ను వాడుకోవాలి. లేదంటే ఒక్క యూనిట్ దాటినా కచ్చితంగా మొత్తం బిల్లు కట్టాల్సి వస్తుంది. వృథాను అరికట్టి సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి.



హరినామ సప్తాహంలో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

కన్నుల పండువగా హరినామ అఖండ సప్తాహ

పిట్లం, మే 10(ఆంధ్రజ్యోతి): స్థానిక విఠలేశ్వర ఆలయంలో శనివారం కన్నుల పండువగా హరినామ అఖండ సప్తాహ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. వారం రోజుల పాటు విఠలేశ్వర ఆలయంలో ప్రతి రోజూ ఉదయం నుంచి రాత్రి వరకు విఠలేశ్వరుని భజన కార్యక్రమాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం సప్తాహ ముగింపు సందర్భంగా ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేకంగా పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో విఠలేశ్వరుని విగ్రహాలను పల్లకిలో పెట్టి, మహిళలు నెత్తిన కళశాలలు ఎత్తుకొని, భజన కళాకారులు విఠలేశ్వరుని పాటలతో ప్రధాన వీధుల గుండా తిరుగుతూ ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

కామారెడ్డి టౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): గత ఐదు సంవత్సరాల నుంచి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సురేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ పరీక్షలు జరగాల్సిన సమయమని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తమకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదని ఈనెల 14న జరగాల్సిన సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని తెలంగాణ యూనివర్సిటీ వీసీకి వినతి పత్రం అందించారని తెలిపారు. ఇలా చేయడం ద్వారా విద్యార్థులందరూ నష్టపోయే అవకాశం ఉందని ముఖ్యంగా తృతీయ సంవత్సరం చదివిపై చదువులకు వెళ్లాల్సిన విద్యార్థులకు తీవ్ర అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. యాజమాన్యాలకు, విద్యార్థులకు ప్రభుత్వం చేయాలని కోరుతున్నామన్నారు.



హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న పట్టణ వాసులు

విధ్వంసం సృష్టించే వారికి ఆపరేషన్ సిందూర్ ఒక గుణపాఠం

కామారెడ్డి టౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): అమాయక ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకుని విధ్వంసం సృష్టించే ఉగ్రవాదులకు, వారికి పరోక్షంగా సహకరిస్తున్న పాకిస్థాన్‌కు ఆపరేషన్ సిందూర్ ఒక గుణపాఠమని హిందూవాహిని జిల్లా సంయోజక్ సాయికిరణ్ అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ధర్మశాలలో హనుమాన్ చాలీసా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టే ఆపరేషన్ సింధూర్‌ను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ చాలీసా పారాయణ ప్రముఖ్ జగదీష్, ఇస్కాన్ జిల్లా ప్రముఖ్ వెంకటదాస్, హనుమాన్ యోగ కేంద్ర అధ్యక్షుడు ఎల్లంకి సుదర్శన్, నరేందర్, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

మాచారెడ్డి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కపూర్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం పంచామృతాభిషేకం, పూర్ణహుతి, తీర్థప్రసాదాల వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఈవో శ్రీధర్ రావు, ఆలయఅర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.



పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు



నిర్మాణ పనులపై సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో

రైతులకు ఇబ్బంది కలగకుండా చూస్తాం

భిక్కనూరు, మే 10(ఆంధ్రజ్యోతి): టోల్‌ప్లాజా నిర్మాణం వల్ల చుట్టుపక్కల రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని ఆర్డీవో వీణ అన్నారు. శనివారం టోల్‌ప్లాజా నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. చుట్టుపక్కల రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, వ్యవసాయ భూముల వద్దకు వెళ్లేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్, టోల్‌ప్లాజా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లింగంపల్లిలో కుట్టు మిషన్‌లను పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్

మహిళలకు కుట్టు మిషన్‌ల పంపిణీ

లింగంపేట, మే 10 ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగంపల్లిలో శనివారం గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్‌లను మాజీ సర్పంచ్ బండి రాజయ్య పంపిణీ చేశారు. ఆసక్తి గల మహిళలకు నెల రోజుల పాటు కుట్టుమిషన్‌లపై శిక్షణను ఇచ్చి ఎస్‌బీఐ సహకారంతో రూ.6500 సబ్సిడీపై కుట్టు మిషన్‌లను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. మిషన్ నేర్చుకున్న మహిళలకు ఉపాధి కల్పిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రవి, కార్యదర్శి భవాని, ఏపీఎం శ్రీనివాస్, జిల్లా కో ఆర్డినేటర్ వెంకటలక్ష్మీ, లావణ్య, దుర్గవ్వ, సీఏ శ్రావణ్, మహిళలు ఉన్నారు.



మృతి చెందిన శివానీ, శంకభాయి (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటోలు)



విద్యుత్ ప్రమాదానికి కారణమైన కూలర్

కూలర్ విద్యుత్ షాక్‌కు గురై తల్లీకూతురి మృతి

• పెద్దగుల్లతండాలో విషాదం

జుక్కల్, మే 10(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా లో శుక్రవారం అర్ధరాత్రి విషాదం చోటు చేసుకుంది. కూలర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో.. విద్యుత్ షాక్ గురై తల్లీకూతురు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని జుక్కల్ మండలం పెద్దగుల్ల తండాకు చెందిన ప్రహ్లాద్, అతని భార్య శంకభాయి (34) వ్యవసాయ కూలి పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, ఒక కూతురు శివాని (14) ఉన్నారు. రోజూ లాగే శుక్రవారం రాత్రి తల్లీ కూతురు ఇంట్లో కూలరు పెట్టుకొని నిద్రించారు. అయితే అప్పటికే కూలరు వైరు తెగి ఉండడంతో.. ప్రమాదవశాత్తు నిద్ర మత్తులో శివాని కాలు కూలర్‌కు తగిలింది. దీంతో ఒక్క సారిగా శివాని విద్యుత్‌షాక్‌కు గురై కాలు కాలిపోయింది. ఆమె కాలి మూడు వేళ్లు తెగిపోయాయి. అలాగే పక్కనే నిద్రపోతున్న తల్లి శంకభాయికి సైతం విద్యుత్‌షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెం దింది. కాగా ఆరు బయట తండ్రి ప్రహ్లాద్, కుమారుడు ప్రతీక్ నిద్రించడంతో వారికి ప్రమాదం తప్పింది. శనివారం తెల్లవారుజామున కుమారుడు ప్రతీక్ లేచి ఇంట్లోకి వెళ్లే సరికి తల్లీకూతుళ్లు జీవచ్ఛవంలా పడి ఉండడాన్ని గమనించి కుటుంబీకులకు తెలిపాడు. వారు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. బిచ్కుంద సీఐ నరేష్, జుక్కల్ ఎస్సై భువనేశ్వర్ ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై వివరాలు సేకరించారు. తల్లీ కూతుళ్ల మృతి గ్రామస్థులను కంటతడి పెట్టించింది. భర్త ప్రహ్లాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విద్యుత్‌షాక్ తాకి శివానీ ఎడమకాలి వేళ్లు తెగిపోయిన దృశ్యం

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పోచారం



టీటీడీలో అన్నదాతలను సన్మానిస్తున్న పోచారం

బీర్కూర్, మే 10 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం తిమ్మాపూర్ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొలువదీరిన కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని శనివారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం దర్శించుకున్నారు. శ్రీవారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఇదిలా ఉండగా మీర్జాపూర్‌కు చెందిన సంధ్య-రాధాకిషోర్ దంపతులు అన్నదాన నిర్వహణ కోసం రూ.20 వేలు, బస్వాపూర్‌కు చెందిన లత-సాయిబాబా దంపతులు రూ.15 వేలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే అన్నదాతలకు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, ఆలయ కమిటీసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దొంగతనాల నియంత్రణకు గస్తీని ముమ్మరం చేయండి

● బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి

బీర్కూర్, మే 10 (ఆంధ్రజ్యోతి): దొంగతనాల నియంత్రణకు రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి పోలీసులకు సూచించారు. శనివారం డీఎస్పీ బీర్కూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌కు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు, పరిష్కారం చేసిన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వాహనాల తనిఖీ చేపట్టాలని ఆదేశించారు. పోలీసులపై ప్రజలకు నమ్మకం కలిగేలా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





బరంగెడ్గిలో సైనికుడి చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న దృశ్యం

వీర సైనికుడికి ఘన నివాళి

బీర్కూర్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బరంగెడ్గి గ్రామంలో ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన వీర జవాన్ మురళీ నాయక్‌కు శనివారం బాబా సాహెబ్ అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు ఘన నివాళులర్పించారు. సైనికుడు మురళీనాయక్ చిత్ర పటానికి పూల మాలల వేసి ఆయన సేవలను కొనియాడారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన యోధుడికి దేశ ప్రజలు రుణపడి ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘ సభ్యులు గైని సంతోష్, గంగాధర్, ప్రశాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీ

మద్నూర్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలానికి సరిహద్దులో జాతీయ రహదారిపై ఎస్సై విజయ్‌కొండ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులు ప్రయాణం చేసే సమయంలో వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, రహదారి భద్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు.

మనోరమ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సు మృతి



స్టాఫ్ నర్సు శిల్ప (ఫైల్)

నిజామాబాద్ అర్బన్, మే 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హైదరాబాద్ రోడ్‌లో గల మనోరమ ఆసుపత్రిలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సు శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. కామారెడ్డి జిల్లా డోంగ్లీకి చెందిన శిల్ప (27) గత కొన్నేళ్లుగా మనోరమ ఆసుపత్రిలో పనిచేస్తోంది. ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి డ్యూటీకి వచ్చిన శిల్ప జ్వరంతో బాధపడుతూ రెస్ట్ తీసుకుంటున్నానని చెప్పి పడుకు ంది. శనివారం ఉదయం తోటి సిబ్బంది ఆమెను పలకరించేందుకు వెళ్లగా.. ఎలాంటి చలనం లేకుండా ఉండడంతో డాక్టర్లకు సమాచారం ఇచ్చారు. పరిశీలించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. కూతురు మృతి చెందిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆసుపత్రి వద్దకు వచ్చి కన్నీరు మున్నీరు అయ్యారు. తమతో పాటు డ్యూటీ చేసిన నర్సు మృతి చెందడంతో తోటి సిబ్బంది సైతం ఆవేదన వ్యక్తం చేశారు. శిల్ప సోదరి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

ఏడాదిలో ఇద్దరు స్టాఫ్ నర్సుల మృతిపై అనుమానాలెన్నో!?

నగరంలోని హైదరాబాద్ రోడ్‌లోగల ప్రైవేటు ఆసుపత్రిలో శనివారం స్టాఫ్‌నర్సు అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా.. ఆమె మృతిపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయమై మృతి చెందిన స్టాఫ్ నర్సు కుటుంబ సభ్యులు పోలీసులకు తమ కూతురు మృతిపై అనుమానాలు ఉన్నట్లు ఫిర్యాదు చేయడంతో మృతిపై అనేక అనుమానాలు వస్తున్నాయి. ఏడాది కాలంలో ఇద్దరు స్టాఫ్ నర్సులు మృతి చెందడం వెనక కారణాలు తెలియాల్సి ఉంది. ఏడాది క్రితం మోపాల్‌కు చెందిన స్టాఫ్ నర్సు తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తన ఆత్మహత్యకు ఆసుపత్రిలో పనిచేస్తున్న సీనియర్ వైద్యుల వేధింపులే కారణం అని సూసైడ్ నోట్‌లో రాసింది. ఇప్పుడు మరో స్టాఫ్ నర్సు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యుల వేధింపులే స్టాఫ్ నర్సుల మృతికి కారణంగా తెలుస్తోంది. ఇప్పటికే మోపాల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు కొలిక్కి రాకపోగా.. ఇప్పుడు అనుమానాస్పద మృతి కింద నమోదైన కేసు ద్వారానైనా నిజాలు బయటకు వస్తాయో.. అన్నది తెలియాల్సి ఉంది.

సలాబత్‌పూర్ ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మద్నూర్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సలాబత్‌పూర్ ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి ప్రతీ శనివారం మూడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహారాష్ట్ర నుంచి తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయానికి వచ్చి పూజల్లో పాల్గొన్నారు.

ఆలయ భూమి కౌలు వేలం పాటలో 51 వేల ఆదాయం

మండలంలోని సలాబత్‌పూర్ ఆలయానికి సంబంధించిన 2 ఎకరాల భూమని శనివారం ఆలయ అధికారులు కౌలువేలం పాట నిర్వహించారు. తడి హిప్పర్గా గ్రామానికి చెందిన రైతు గంగాగౌడ్ 2 ఎకరాల భూమికి 51 వేలు కౌలు చెల్లించి భూమిని దక్కించుకున్నారు. దీంతో గంగాగౌడ్ సంవత్సరం పాటు ఈ భూమిలో పంటలు సాగు చేసుకోవచ్చని ఆలయ అర్చకులు వేణు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన నర్సాగౌడ్

సదాశివనగర్, మే 10(ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ శివారులోని గాంధారి వెళ్లే రోడ్డు మోడిగాం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగుల నర్సాగౌడ్ (55) మృతి చెందినట్లు ఎస్ఐ రంజిత్ తెలిపారు. చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన నర్సాగౌడ్ మొండిసడక్ నుంచి చిన్నమల్లారెడ్డికి బైక్‌పై వెళ్తుండగా మోడెగాం సమీపంలోని రైస్‌మిల్ వద్ద వేగంగా వస్తున్న లారీ ఢీకొనగా నర్సాగౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తిమ్మాపూర్‌లో రెండిళ్లలో చోరీ

● 10 తులాల బంగారం, 24 తులాల వెండి

● 1.13 లక్షల నగదు అపహరణ

బీర్కూర్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో రెండిళ్లలో భారీ చోరీ జరిగింది. ఈ ఘటనలో తిమ్మాపూర్ తండాకు చెందిన ధన్‌సింగ్ ఇంట్లో 65 గ్రాముల బంగారు నగలు, 1.13 లక్షల నగదు చోరీకి గురయింది. దీంతో పాటుగానే తిమ్మాపూర్ గ్రామానికి చెందిన అల్వాల్ చంద్రయ్య ఇంట్లో 35 గ్రాముల బంగారం, 24 తులాల వెండి ఆభరణాలు దొంగలు అపహరించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తిమ్మాపూర్ తండాకు చెందిన ధన్‌సింగ్ తన మనవడి ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులందరితో కలిసి గురువారం సాయంత్రం బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. ఆసుపత్రిలో చూపెట్టుకున్న అనంతరం శుక్రవారం ఉదయం ఇంటికి రాగా తాళాలు పగులగొట్టి ఉండటంతో పాటు బీరువా తలుపులు ధ్వంసం చేయబడి ఉన్నాయి. బీరువాలో దాచి ఉంచిన 6.5 తులాల బంగారు ఆభరణాలు, 1.13 లక్షల నగదు చోరీకి గురయినట్లు గుర్తించారు. వెంటనే బీర్కూర్ పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఘటన స్థలికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. ధన్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా తిమ్మాపూర్ గ్రామానికి చెంది అల్వాల్ చంద్రయ్య కుటుంబం గురువారం సాయంత్రం ఇంటికి తాళం వేసి ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకునేందుకు వెళ్లారు. శుక్రవారం మధ్యాహ్నం గ్రామ కారోబార్ శంకర్ ఇందిరమ్మ ఇళ్ల సర్వే కోసం ఇంటికి రాగా చంద్రయ్య ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటం గమనించి చంద్రయ్యకు సమాచారం అందించారు. చంద్రయ్య గ్రామానికి చేరుకుని ఇంటి తలుపులతో పాటు బీరువా ధ్వంసం అయి ఉండటం గుర్తించారు. బీరువాలో దాచి ఉంచిన 3.5 తులాల బంగారం, 24 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురయినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మండలంలో వరుసగా దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.



డీఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఇటుక బట్టి తొలగించాలని డీఎస్పీకి వినతి

బాన్సువాడ, మే 10 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండల పరిధిలోని సోమేశ్వర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన కృష్ణవేణి ఇటుక బట్టిని తొలగించాలని కోరుతూ శనివారం సోమేశ్వర్ గ్రామస్థులు బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామ శివారులో గల వ్యవసాయ భూముల పక్కనే ఇటుక బట్టి ఏర్పాటు చేయడం వల్ల ఇటుక బట్టికి చెందిన దుమ్ము, ధూళి దాని వ్యర్థాలు పంట పొలాల్లో పడి పంటలకు ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. దీంతో పాటుగానే రహదారి గుండా ప్రయాణించే వారి కళ్లలో పడి ఇబ్బందుల పాలవుతున్నారని పేర్కొన్నారు. ఇటుక బట్టి వ్యర్థాలతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ఇటుక బట్టిని తొలగించిన ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని విన్నవించారు.

ప్రజలు ఆన్‌లైన్ మోసాలకు గురికావొద్దు

డోమకొండ, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దని ఎస్సై స్రవంతి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంక్ అధికారులమంటూ మాట్లాడుతూ బ్యాంక్ వివరాలు, ఏటీఎం పిన్ నెంబర్, ఓటీపీ అడిగితే చెప్పకూడదన్నారు. ఫోన్‌కి మెసేజ్ రకంగా వచ్చే యాప్‌లను డౌన్‌లోడ్ చేయకూడదన్నారు. కొత్త నెంబర్ల నుంచి వచ్చే వీడియోకాల్‌ను మాట్లాడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులు, తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు

ముందస్తు బడిబాట కార్యక్రమం

కామారెడ్డి టౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని వడ్డెర కాలనీ, బతుకమ్మ కుంటలలో శనివారం గంజ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లింగం ఆధ్వర్యంలో ముందస్తు బడిబాట కార్యక్రమం చేపట్టారు. ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించి ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - శుభం
ప్రియా 70 - జగదేక వీరుడు అతిలోక సుందరి
ప్రియా 35 - సింగిల్

బాన్సువాడ

మహేశ్వరి - హిట్ 3
వెంకటేశ్వర - సీఎం పెళ్లాం

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

